క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ పూర్వ వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా లింగరాజు ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు విన్నవించారు. ఈమేరకు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల వారసుల జిల్లా అధ్యక్షుడు చిర్రా నాగేశ్వరరావు, నాయకులు నాగుల్‌మీరా, షరీఫ్, యాకుబ్, వీరయ్య, రామచంద్రయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంఅర్బన్: నగరంలోని పలు డివిజన్లలో కల్యాణలక్ష్మి, సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను మేయర్ నీరజ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు సకాలంలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహర, ఎర్రం బాలగంగాధర తిలక్, కమర్తపు మురళీ, కల్వకుంట్ల గోపాల్, బాణాల లక్ష్మణ్, దేవత శంకర్, నున్నా మాధవరావు, బొమ్మ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 3వ డివిజన్ కార్పొరేటర్ దివంగత మలీదు జగన్ సతీమణి నాగమణి డివిజన్ పరిధిలోని బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు.

ఉచిత చేప పిల్లలు..

తిరుమలాయపాలెం: ప్రభుత్వం ఉచితంగా అందించిన చేప పిల్లలను మండలంలోని రాజారం గ్రామంలో గల చెరువులో మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యాన వదిలారు. పంచాయతీ కార్యదర్శి గోపి, కాంగ్రెస్ నాయకులు మందుల రాజీవ్, కందాల చంద్రారెడ్డి, రంగాపురం వీరన్న, గుండాల మల్లయ్య, పేర్ల నాగయ్య, సామ దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్..

నేలకొండపల్లి: నేలకొండపల్లికి చెందిన ఉమామహేశ్వరరావు గత 25 రోజుల క్రితం గువ్వలగూడెం గ్రామంలో తన మొబైల్‌ను పోగొట్టుకుని స్థానిక పోలీస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి మంగళవారం బాధితుడికి ఎస్సై పి.సంతోష్ అందించారు. ఈ కార్యక్రమంలో మోర సైదులు తదితరులు పాల్గొన్నారు.

దారి విషయంలో ఘర్షణ

- ఇరువర్గాలపై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని పుటానితండాలో దారి విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటనలో ఇరువర్గాలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం రహదారిపై ట్రాక్టర్లు నిలిపే విషయంలో రెండు వర్గాలు ఘర్షణ పడి ఇరువర్గాల వారు ఫిర్యాదు చేయడంతో రెండు కేసులు నమోదైనట్లు చెప్పారు.

వరంగల్ సభకు తరలిన సమాఖ్య సభ్యులు

రఘునాథపాలెం: వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవ సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళా సమాఖ్య సభ్యులు ప్రత్యేక బస్సులో మంగళవారం తరలివెళ్లారు. ఇందిరాక్రాంతి కార్యాలయ ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఈ బస్సును మండల పరిషత్ కార్యాలయం నుంచి బయలుదేరి వెళ్లింది.

గుంత పూడ్చివేత

కామేపల్లి: ముచ్చర్ల–ఏన్కూర్ ప్రధాన రహదారి మద్దులపల్లి రైతు వేదిక సమీపాన బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలే శ్రీనుయాదవ్, సూర్యతండా మాజీ ఎంపీటీసీ గుగులోత్ లచ్చిరాం పూడ్చివేశారు. గుంతను పూడ్చకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని, బీటీ రోడ్డు మరమ్మతులను చేపట్టాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు అండగా ఏఐఎస్‌ఎఫ్

ఖమ్మంరూరల్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి బూర మనోజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాను రాను పాలకులు బడ్జెట్‌లో విద్యకు అవసరమై నిధులు కేటాయించకపోవడంతో ప్రైవేట్ చదువులకు పేద విద్యార్థులు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో పారిశుద్ధ్య లేమితో విద్యార్థులు అనారోగ్యాలపాలవుతున్నారని, ఈ విషయంలో ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏఐఎస్‌ఎఫ్ అండగా నిలుస్తూ వారి సమస్యల సాధనకై పోరాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు రాము, రవి, ఉపేందర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాయం..!



ప్లాట్లలోని బేస్‌మెంట్‌కు ఆనుకుని తవ్వకాలు

పంథామార్చిన 'మట్టి' వ్యాపారులు

- రాత్రికిరాత్రే రోడ్లు, ప్లాట్లలో తవ్వకాలు
- లాభార్జనే ధ్యేయంగా తోలకాలు
- మంత్రుల చొరవతో కొంతమేర అదుపులోకి..
- అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

ఖమ్మంఅర్బన్: ఎన్ని నిబంధనలు అమలులో ఉన్నా అక్రమ మట్టి దందా మాత్రం ఆగడం లేదు. ఏదో ఒక చోట అక్రమ పద్ధతిలో తవ్వకాలు చేస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఇప్పటి వరకు గుట్టలు, క్వారీ లు, చెరువుల్లో మట్టి తవ్వకాలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ అనుమతుల పేరుతో కొంత మంది, ఎలాంటి అనుమతులు లేకుండా అనుమతులు ఉన్నాయని నమ్మబలుకుతూ మరికొంతమంది జిల్లా వ్యాప్తంగా మట్టి దందా జోరుగా సాగుతున్న విషయం తెలిసిందే. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాకు చెందిన మంత్రులు మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తుండడంతో కొంతమేర అదుపులోకి వచ్చింది.

లాభార్జనే ధ్యేయంగా..

గుట్టలు, క్వారీల్లో అధికారుల దృష్టి ఉంటుందని భావించిన కొంతమంది మట్టి దందా వ్యాపారులు మండలంలోని రఘునాథపాలెం బైపాస్ పక్కన 218 ప్రభుత్వ సర్వే నంబర్లలో పేదలకు ఇచ్చిన ప్లాట్లు, ప్లాట్ల కోసం వేసిన దారుల్లో ఇటీవల తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్లాట్లకు బేస్‌మెంట్ కట్టి ఉన్నా మట్టి తవ్వకదారులు అవి ఏమి పట్టించుకోకుండా, తమకు లాభార్జనే ధ్యేయంగా అడ్డదిడ్డంగా ప్లాట్లు, రోడ్లలో రాత్రికి రాత్రే తవ్వకాలు చేపడుతూ మట్టి తోలకాలు జోరుగా సాగిస్తున్నారు. ప్లాట్లదారులు ఉదయం వచ్చే సరికి గుంతలు పడి మట్టి తీసిన కందకాలు దర్శనమిస్తున్నాయి. ఎవరు తవ్వకాలు చేశారనే దానిపై తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి అక్రమ తవ్వకదార్లపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రహదారిపై తవ్వకాలు ఇలా..

సమగ్ర సర్వేపై అధికారుల ఆరా

- **కూసుమంచి:** కూసుమంచి మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేపై తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌తో పాటు కమిషన్ సభ్యులు ఆరా తీశారు. మంగళవారం రాత్రి కూసుమంచిలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన సర్వే తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో వివరాలు నమోదు చేసిన ఫామ్‌లను పరిశీలించి కంప్యూటరీకరణ చేస్తున్న సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం సర్వే ఫామ్‌లను భద్రపరిచే గదిని పరిశీంచి సర్వే పారదర్శకంగా కొనసాగాలని సూచించారు. ఆయన వెంట కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మితో పాటు ప్రత్యేకాధికారి సతీష్‌కుమార్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య క్షేత్రస్థాయికి వెళ్లి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లతో మాట్లాడి ప్రజల నుంచి సమాచారం సేకరణ సమయంలో అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారాన్ని తప్పులు లేకుండా చూడాలన్నారు.



కూసుమంచి: సర్వే వివరాలను తెలుసుకుంటున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

- **నేలకొండపల్లి:** మండలంలోని గువ్వలగూడెంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఎంపీడీఓ ఎం.యర్రయ్య పర్యవేక్షించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి పనులు యుద్ధప్రాతిపదికన త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

పాత రెన్యూవల్ విధానాన్ని అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఎగుమతి, దిగుమతి వ్యాపారుల లైసెన్సుల రెన్యూవల్‌ను గతంలో మాదిరిగా ఐదేళ్లకోసారి చేయాలని సీపీఎం అనుబంధ వ్యాపార శాఖల సభ్యులు కోరుతున్నారు. ప్రస్తుతం మూడేళ్లకోసారి రెన్యూవల్ చేస్తున్నారని వాపోతూ మంగళవారం వ్యాపార ప్రతినిధులు ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మార్కెట్ యార్డులో పని చేస్తున్న వారికి డ్రెస్‌కోడ్ లేకపోవడంతో పంట ఉత్పత్తులు మాయమవుతున్నాయన్నారు. గతంలో ఉన్న భోజనశాలను పునరుద్ధరించాలని, రైతులకు రూ.5లకే భోజన పథకం అమలు చేయాలని, విశ్రాంతి భవనం, ప్రత్యేక వైద్య సౌకర్యం ఏర్పాటు చేయాలని, కమీషన్ వ్యాపారుల ద్వారా సీసీఐ పత్తి కొనుగోళ్లను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాపార వర్గాల ప్రతినిధులు వీరబాబు, రమణారెడ్డి, సుధీర్‌కుమార్, వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటరాములు, ఈశ్వర్, ప్రసాద్, యాలాద్రి, శ్రీనివాసరావు, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

కామేపల్లి: గ్రామాల్లో బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ వర్క్‌షాప్ ఇన్‌చార్జ్ రామ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు అధ్యక్షతన మండల బూత్ కమిటీ, అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లను నియమించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన విఫలమైందని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలకు తెలియజేసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాన్నారు. నాయకులు బాగం రంగారావు, భూక్యా శ్రీనునాయక్, పోలూరి రామచంద్రయ్య, జాలే శ్రీనుయాదవ్, వెంకట్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్'లో వర్క్‌షాప్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం విభాగం, సోహం అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన రోబోటిక్స్–అనుభవపూర్వక అభ్యసనం అనే అంశంపై మంగళవారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా మాట్లాడుతూ.. నిత్య జీవితంలో రోబోటిక్స్ పాత్ర, అవి మనిషి జీవితాల్లో పోషిస్తున్న పాత్రపై అవగాహన కల్పించారు. కాగా, సోహం అకాడమీ రోబోటిక్ ఇంజనీర్ కె.రాహుల్ ఆడినో కంట్రోలర్, సెన్సార్స్, ఎలక్ట్రానిక్ తదితర వాటిపై ప్రాక్టికల్ చేపించారు. 21 అంశాలను పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి, ఐక్యు ఏసీ కో ఆర్డినేటర్ సునంద, అధ్యాపకులు కిరణ్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, సూరంపల్లి రాంబాబు, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



తేమశాతాన్ని పరిశీలిస్తున్న సీతారాంరెడ్డి

తిరుమలాయపాలెం: తేమశాతం విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకున్నాకే సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకొని మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని గోల్ తండా పరిధిలోని భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి కమీషన్ తరగు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యే సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దళారులకు పత్తిని విక్రయించొద్దని పేర్కొని సీసీఐ కొనుగోళ్ల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నవనీత, సీసీఐ అధికారి రవీందర్ రెడ్డి, మిల్లు నిర్వాహకులు శేర్విరాల కృష్ణమూర్తి, సతీష్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

- **ఖమ్మం మామిళ్లగూడెం:** పెన్షనర్లకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. సమస్యల సాధనకై మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 5డీఏలు ఇస్తామని, ఆరు నెలల్లో పీఆర్‌సీ అమలు చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తామని చెప్పి 11 నెలలకు ఒక డీఏ మాత్రమే ఇచ్చి మిగిలినవి పట్టించుకోలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ, వీరబాబు, కృష్ణారావు, మాధవరావు, శ్రీధర్‌రావు, రాజేంద్రప్రసాద్, స్వామి, టీఎన్‌రావు, నాగేశ్వరరావు, గణపతి, వెంకట్రామారావు, శ్రీనివాసరావు, ఉమేష్, ఏసోబు, గోవిందరావు, ఉపేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.
- **కామేపల్లి:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మంగళశారం తహసీల్దార్ సుధాకర్‌కు సీపీఐ(ఎంఎల్) ఎన్డీ ఆధ్వర్యాన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ఎన్‌డీ పార్టీ నాయకులు భూక్యా శివనాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. రుణమాఫీ కానీ రైతులకు మాఫీ చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ రాంజీనాయక్, అజ్మీరా అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం మామిళ్లగూడెం: ధర్నా చేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

రైతులకు ఇబ్బంది రానివ్వొద్దు

కూసుమంచి: రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) పుల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పాలేరు, జుజుల్‌రావుపేట, కూసుమంచి, నేలపట్ల గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు చేసిన ఎరువులకు రసీదు ఇవ్వాలని, పీఓఎస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలుతప్పవని హెచ్చరించారు. అనంతరం జక్కేపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరి కోసిన తరువాత అవశేషాలను తగులబెట్టొద్దని రైతులకు సూచించారు. అంతకు ముందు కూసుమంచిలోని రైతు వేదికలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పత్తి కొనుగోళ్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం కిష్టాపురంలో సాగుచేసిన పామాయిల్ తోటను జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌తో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఏడీఏ సరిత, ఏఓ వాణి ఉన్నారు.

గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్పించొద్దు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు తమ గుర్తింపునకు బదులుగా వేరే పేర్లతో బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా కొత్తగా ఏర్పాటు చేసిన బోర్డులు, బస్సుల మీద పేర్లు తక్షణమే తొలగించాలని, లేనిపక్షంలో వారి ప్రభుత్వ గుర్తింపును రద్దు చేస్తామన్నారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నట్లయితే వారికి నోటీసులు ఇచ్చి మూసివేయాలన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలను గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్పించవద్దన్నారు.

సీఎం వ్యాఖ్యలపై ఖండన

ఖమ్మంమామిళ్లగూడెం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ బహిరంగసభలో మాట్లాడిన వ్యాఖ్యలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం పోరుయాత్ర చేసింది కిషన్‌రెడ్డి అని పార్లమెంట్‌లో బిల్లు పాస్ కావాలని నిరాహారదీక్ష చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ కోసం 1300 మంది ఆత్మ బలిదానాలు చేసుకుంటే సోనియాగాంధీ బలిదేవత అన్న విషయాన్ని గుర్తు చేశారు. కిషన్‌రెడ్డి తెలంగాణ కోసం ఉద్యమాలు చేస్తే సమైఖ్యాంధ్ర కోసం సహకరించిన విషయాన్ని మరిచిపోయినట్లుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు తాండ్ర వినోద్‌రావు, అల్లిక అంజయ్య, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ జోసెఫ్' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంరాపర్తినగర్: ఈనెల 16, 17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన రెండు రాష్ట్రాల స్థాయి వ్యాసరచన, ఫైన్ ఆర్ట్స్ పోటీల్లో నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం ప్రతిభ చూపిన విద్యార్థులు రిషిక్, ధాత్రి, వర్షిక, సత్యనారాయణ, రక్షిత, హాసికలను కరస్పాండెంట్ రెవరెండ్ కె.మరియ సుందరి, హెచ్‌ఎం పి.ఆరోగ్యం మేరీ, ఉపాధ్యాయులు అభినందించారు.

వక్తృత్వ పోటీలో కైకొండాయిగూడెం విద్యార్థిని..

ఖమ్మంఅర్బన్: నగరంలోని కై కొండాయిగూడెం పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.బిందు 3హెచ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. ఈమేరకు మంగళవారం విద్యార్థినిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మెడికల్ కాలేజీ ఘటనపై విచారణ జరిపించాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ మెడికల్ కళాశాల కాలేజీ విద్యార్థిని అసిస్టెంట్ ప్రొఫెసర్ గుండు కొట్టించిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జి.మస్తాన్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌కు వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ర్యాగింగ్ అరికట్టేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దారుణమన్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాన్నారు. నాయకులు సుధాకర్, శివనాయక్, అజయ్, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, విద్యార్థికి గుండు కొట్టించడం దుర్మార్గమని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు వినయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాగింగ్‌ను వ్యతిరేకిస్తూ మంగళవారం ఖమ్మంలోని ఏఎస్‌ఆర్ కళాశాల వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు పృథ్వీ, సందీప్, స్టాలిన్, నరేందర్, అన్వేష్, పాషా, అఖిల, స్పందన తదితరులు పాల్గొన్నారు.



సీపీకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆలయంలో ఆకుపూజ

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు ఆంజనేయస్వామి దేవాలయంలో వాసవి భవన్ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యాన పూజారి పంతంగి పవన్‌కుమార్‌శర్మ ఆకుపూజ జరిపారు. ఈ కార్యక్రమానికి మాలధారణ భక్తులు పాల్గొని పూజలు చేసి ఆట, పాటలతో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కె.కోటేశ్వరరావు, పావులూరి వెంకటేశ్వరరావు, వేముల విజయ్, నున్నా ఉదయ్, పరుచూరి బ్రహ్మం, కొత్తా రవి, కూరపాటి సతీష్, పసుపులేటి రంగయ్య, ఆంజి, పసుపులేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలగణపతి ఆలయంలో..



పూజలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఇందిరానగర్ జంక్షన్‌లోని శ్రీబాలగణపతి దేవాలయంలో వద్ద మంగళవారం రాత్రి సంకటహర చతుర్థిని పురస్కరించుకుని అయ్యప్ప మాలధారులు భజన, పూజలు నిర్వహించారు. వందలాది మంది మాలధారులు పాల్గొనగా బోయపాటి శ్రీను బృందం ఆధ్వర్యాన భజన జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు, ప్రధాన అర్చకులు గిరిధర్ ఆధ్వర్యాన పూజలు నిర్వహించగా చావా సుమిత్ర – రామ్మూర్తి దంపతులు అల్పాహారం సమకూర్చారు.

ధాన్యం నగదు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

కూసుమంచి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోగా నగదు వారి ఖాతాలకు జమచేయాలని సీపీఎం పాలేరు డివిజన్ ఇన్‌చార్జ్ బండి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు ఇస్తామన్న రూ.500 బోనస్‌ను వెంటనే చెల్లించాలని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా ఉండాలంటే కమిటీల్లో అఖిలపక్ష పార్టీలకు చెందిన వారిని నియమించాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు శీలం గురుమూర్తి, మల్లెల హన్మంతరావు, ఎడవెల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఖమ్మం లీగల్/ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది మద్రి కృష్ణమూర్తి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఎం జిల్లా నాయకుడు సిద్దినేని కోటయ్య, తమ్మినేని కోటేశ్వరరావులు సందర్శించి నివాళులర్పించారు. వీరి వెంట తమ్మినేని విజయలక్ష్మి, కమలమ్మ, పుల్లయ్య, కిషోర్, మాస్‌లైన్ నాయకులు గుర్రం అచ్చయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంలో ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటు చేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నెరెళ్ళ శ్రీనివాసరావు, కార్యదర్శి చింతనిప్పు వెంకట్‌తో పాటు పలు న్యాయవాద లీగల్ సంఘాలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో ముందుకు..

ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె దేశానికి అందించిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



కామేపల్లి: ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఖమ్మంవన్‌టౌన్: ఎంపీ క్యాంపు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



ప్రతిభ చూపిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కమాన్‌బజార్ బాలికోన్నత పాఠశాలలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, అబ్దుల్ కలాం ఆజాద్‌ల పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా విజేత లకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షుడు బి. శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీరాం, డీపీసీ రావు, విశ్వేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకయ్య, ఖలీల్, హెచ్‌ఎం శైలజ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం ముగ్గులు, చైర్స్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహర, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలతలు పాల్గొని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి అర్జున్, ఉద్యోగులు కేవీఎస్‌ఎల్‌ఎన్ రాజు, ఇమామ్, భాస్కర్, కనకవల్లి, లలితకుమారి, రవి, బాబు, విజయకుమారి, రోజా కిషోర్, శ్రీనివాస్, రోహిత్, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.